బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాంలు

- గాలి అనిల్‌కుమార్, వెంకట్రామారెడ్డికి అందజేసిన గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్

7లో

ఆ రెండు పార్టీలను పక్కన పెట్టండి

- పోలయ్యే ప్రతీ 2 లక్షల ఓట్లలో 1.25 లక్షల ఓట్లు కాంగ్రెస్‌కు వేయించాలి
- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విజ్ఞప్తి



పటాన్‌చెరు సమీపంలోని పాటి వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



జగ్గారెడ్డికి బొకేను అందజేస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 18 : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను పక్కన పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కోరారు. పటాన్‌చెరు సమీపంలోని పాటి వద్ద ఓ ఫంక్షన్‌హాలులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజానిధులకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పోలయ్యే ప్రతీ 2 లక్షల ఓట్లలో 1.25 లక్షల ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి వేయించాలని, అప్పుడే కాంగ్రెస్ సత్తా ఏమిటో ఇతర పార్టీలకు తెలుస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం తథ్యం అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్

- ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ దాఖలు పక్రియ మొదలైంది. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. హెల్ప్‌డెస్క్‌లలో నామినేషన్ పత్రాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు, 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు చివరి గడువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి నామినేషన్ దాఖలు సమయంలో వివరాలు సమర్పించాలని సూచించారు. ఎన్నికల ఖర్చులను ఈ బ్యాంకు ఖాతా నుంచి నిర్వహించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మీడియా సెంటర్ సందర్శన

మెదక్ అర్బన్, ఏప్రిల్ 18: మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను జిల్లా వ్యయ పరిశీలకులు సునీల్‌కుమార్ వాన్ని గురువారం సందర్శించారు. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును పరిశీలించారు. సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీం పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, వీడియో రికార్డింగ్ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ అకౌంట్ సమాచారం, ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమైన వారి అకౌంట్, జీఎస్టీ అకౌంట్ వివరాలు, ఇప్పటివరకు సీజ్ చేసిన నగదు, మద్యం, నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

ఇక సమరమే!

- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- మొదలైన నామినేషన్ల ఘట్టం
- తొలిరోజు జహీరాబాద్‌కు ఒకటి, మెదక్‌కు నాలుగు నామినేషన్లు దాఖలు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 18 : నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడంతో పార్లమెంటు ఎన్నికల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల కదన రంగంలో ప్రచార సునామీ మొదలవనున్నది. బరిలో ఉన్న తమ పార్టీ అభ్యర్థుల విజయానికి అధినేతలు తరలివస్తున్నారు. ఇప్పటికే మెదక్ లోకసభ సెగ్మెంట్‌కు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించి బీఫామ్‌లను సైతం అందజేశాయి. నామినేషన్ల సమర్పణ నుంచే భారీ బలప్రదర్శన చేపట్టేలా అభ్యర్థులు ప్రణాళిక రచించుకున్నారు. అట్టహాస ప్రచార హోరుతో లోక్‌సభ సమరం తారాస్థాయికి చేరనున్నది.

మెదక్ లోకసభ నియోజకవర్గంపై ప్రధాన పార్టీలన్నీ దృష్టి సారించాయి. 2004 నుంచి 2019 ఎన్నికల దాకా బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్న ఈ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇక మెదక్ పార్లమెంటులో 18 సార్లు ఎన్నికలు జరిగితే 9 దఫాలుగా విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సైతం మళ్లీ దక్కించుకునేందుకు ఫోకస్ పెట్టింది. కేంద్రంలో హ్యాట్రిక్‌పై దృష్టిపెట్టిన బీజేపీ కూడా ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది.

మరో సభకు కేసీఆర్ ప్లాన్

మెదక్ లోకసభ పరిధిలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఇటీవల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో బహిరంగసభ నిర్వహించారు. మూడు నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేసి తమ సందేశం వినిపించారు. ఇక మెదక్, దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల ప్రజలు, కార్యకర్తలతోనూ మరో బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో అనుకూలంగా ఉన్న చోట సభను ఏర్పాటు చేయనున్నారు. అప్పటివరకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున ప్రచారం చేయనున్నారు. మండలాలు, పట్టణాలవారీగా సభలు, రోడ్‌షోలు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

> **అధినేతల రాకతో హోరెత్తనున్న ప్రచారం**
> **ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ సభ**
> **తాజాగా గోవా సీఎం కార్నర్ మీటింగ్**
> **రేపు మెదక్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
> **మోదీ, అమిత్‌షా, రాహుల్ సభలు**

రాహుల్‌తో బహిరంగ సభ

మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై సభలో పాల్గొననున్నారు. ఆ తర్వాత మిగతా ఆరు నియోజకవర్గాల్లో ఒకచోట జరిగే సభకు రేవంత్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇందిరాగాంధీ ప్రాతినిథ్యం వహించిన మెదక్ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ బహిరంగ సభకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రియాంక గాంధీతో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలతో రోడ్‌షోలు కూడా నిర్వహించనున్నట్లు తెలిసింది. స్థానికంగా మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు.

మోదీ, అమిత్‌షా సభలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ ఈ లోకసభ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్‌లో సభ నిర్వహించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ నరేంద్రమోదీతో భారీ బహిరంగ సభను తలపెట్టడానికి ఆ పార్టీ సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. అదే విధంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షాలతోనూ సభలు, లేదా కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు గోవా సీఎం ప్రమోద్ సావంత్ హాజరయ్యారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు, కీలక నేతలు మెదక్ లోకసభ నియోజకవర్గాన్ని చుట్టేయనున్నారు.



ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావు

తొలిరోజే బోణి

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల ప్రక్రియకు తెరలేచింది. సంగారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. తొలిరోజు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలయ్యింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. తొలి రోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున ఆయన అనుచరులు సాగర్‌తో పాటు నలుగురు కార్యకర్తలు ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మెదక్ లోక్‌సభ స్థానానికి మెదక్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి దొడ్ల వెంకటేశం, స్వతంత్ర అభ్యర్థి చిక్కుపల్లి నవీన్‌కుమార్ తమ నామినేషన్లు సమర్పించారు. నలుగురు అభ్యర్థుల తరఫున ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.

మొదటిరోజు నామినేషన్లు	
మెదక్	4
జహీరాబాద్	1





మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఆ పార్టీ నాయకులు

నో ఎంట్రీ..!

మునుపెన్నడూ లేని భద్రతా చర్యలు



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద భారీ సంఖ్యలో బలగాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 18 : నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కాగా, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయమైన సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద మునుపెన్నడూ లేనివిధంగా భద్రతా చర్యలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో, కలెక్టరేట్ నుంచి సంగారెడ్డిలోకి వెళ్లే దారిలో 500 మీటర్ల దూరంలోనే బారికేడ్లను పెట్టేశారు. కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. కలెక్టరేట్‌కు పనుల కోసం వచ్చే సాధారణ ప్రజలను రానివడం లేదు. మీడియా ప్రతినిధులను ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేసిన షామియానా వరకు మాత్రమే అనుమతించారు. కనీసం డీపీఆర్వో కార్యాలయంలోకి వెళ్లనీయడం లేదు. జిల్లాస్థాయి అధికారుల వాహనాలను కూడా లోపలికి అనుమతించకపోవడం గమనార్హం. జిల్లాస్థాయి అధికారులు కూడా పోలీసులకు తమ గుర్తింపు కార్డులను చూపించి కలెక్టరేట్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. దశాబ్దాల కాలంగా ఎన్నికలు జరుగుతున్నా ఇలాంటి భద్రతా చర్యలు మునుపెన్నడూ కనిపించలేదని పలువురు అధికారులే అంటున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంగా కొనసాగిన సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ మెదక్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా, జాయింట్ కలెక్టర్ జహీరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఆ సమయంలోనూ ఇంతటి అసాధారణ భద్రతా చర్యలు లేవని, అయినా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగిందని జిల్లా స్థాయి అధికారి ఒకరు గుర్తుచేశారు.



కలెక్టరేట్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే దారిని మూసివేసిన పోలీసులు

ప్రైవేటు వైద్యంపై నజర్



- నిబంధనలు పాటించని క్లినిక్‌లపై నిఘా
- ఆర్ఎంపీ, అంబులెన్స్ వ్యవస్థలను గాడిన పెట్టేందుకు చర్యలు
- అవసరమైతే కేసుల నమోదు
- డాక్టర్లు లేకున్నా ఆస్పత్రుల నిర్వహణపై ఫోకస్
- ఇక టీఎస్ఎంసీ ముమ్మర తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : సంగారెడ్డి జిల్లాలో అర్హత లేకుండా వైద్యం అందిస్తున్న వారితో పాటు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మధ్యనే ఎన్నికైన నూతన మెడికల్ కౌన్సిల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల ప్రక్షాళన దిశగా అడుగులేస్తున్నది. జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీ చేయాలని నిర్ణయించింది.

అర్హత లేని వారితో వైద్యమా?

మెజారిటీ ప్రైవేటు ఆస్పత్రుల్లో సరైన అర్హత లేని వారు పేషెంట్లకు వైద్య సేవలందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల హైదరాబాద్ నగర పరిధిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. అర్హత లేని వారిని డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా(డీఎంవో) ఆయుష్ డాక్టర్లు, ఫార్మా-డి డిగ్రీ చేసిన వారినీ నియమిస్తున్నట్లు తేలింది. అటువంటి వారే రోగుల కేస్ షీట్లు రాస్తున్నట్లు గుర్తించారు. అంతే కాకుండా చాలా ప్రైవేటు ఆస్పత్రులు వాటి రిజిస్ట్రేషన్ నంబర్లను ప్రదర్శించడం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన డాక్టర్లు ఇక్కడి మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే వైద్య సేవలందిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. మరికొందరు డాక్టర్లు వారి రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించుకోకుండానే ప్రాక్టీస్ చేస్తున్నట్లు తేల్చారు. సంగారెడ్డి జిల్లాలోనూ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

నిబంధనలు బేఖాతరు

జిల్లాలో మెజారిటీ ప్రైవేటు ఆస్పత్రులు ఆర్ఎంపీల సిఫారసుతోనే నడుస్తున్న పరిస్థితి ఉన్నది. స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల పేరిట ప్రచారం చేసుకుంటూ వైద్యులు లేకపోయినా విషమ పరిస్థితిల్లో వచ్చిన బాధితులను చేర్చుకుని దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, డాక్టర్ల పేరు, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి. ఆ నిబంధనలేమీ చాలా ఆస్పత్రుల్లో కానరావడం లేదు.

ఆర్ఎంపీ వైద్యంపై స్పెషల్ ఫోకస్

గతంలో కొంత మంది ఆర్ఎంపీ, పీఎంపీలకు ఏడాది పాటు శిక్షణ ఇచ్చారు. ఎంత మందికి శిక్షణ ఇచ్చారన్న నిర్దేశిత సంఖ్య ఆరోగ్య శాఖ వద్ద లేదు. దీని ఆధారంగా చేసుకొని ఎవరికి వారు ప్రథమ చికిత్సా కేంద్రాలను నెలకొల్పి స్థాయికి మించి చికిత్స చేస్తున్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. మందులు అమ్మకూడదు. ఎలాంటి మందులు రాయకూడదు. రోగి పరిస్థితి సీరియస్‌గా ఉంటే సమీపంలోని పీహెచ్‌సీ, లేదా ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలే తప్ప, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు కమీషన్ల కోసం పంపడం నేరం. కానీ, నిబంధనలు పాటించకుండా జిల్లాలో చాలా మంది యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇవ్వడం, గర్భిణులకు శస్త్ర చికిత్సలు చేయడం, కమీషన్ల కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు పంపడం వంటివి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 కుపైగా ప్రథమ చికిత్స కేంద్రాలున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. తమకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అండదండలున్నాయంటూ ఆర్ఎంపీలు బాహాటంగా చెప్పుకోవడం గమనార్హం. ఇలా స్థాయికి మించి వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలు, సహకరిస్తున్న వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నారు.

అంబులెన్స్‌ల కమీషన్ దందా

అంబులెన్స్ నిర్వాహకుల ఆగడాలు తారాస్థాయికి చేరుతున్నాయి. బాధితులు వెళ్లేందుకు సిద్ధంగా లేకున్నా, రోగులను వెంట పడి మరీ ఆస్పత్రిలో చేర్పించేలా చూస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చౌరస్తాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు అంబులెన్స్ డ్రైవర్లు.. ఒక కేసు తీసుకొస్తే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఈ దందా బయటికి పొక్కడంతో ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు అప్రమత్తమైనట్టు సమాచారం.

తనిఖీలకు టీఎస్ఎంసీ ప్రణాళిక

నిబంధనలు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై కొరడా ఝుళిపించేందుకు టీఎస్ఎంసీ ఓ ప్రణాళిక సిద్ధం చేసింది. తనిఖీలకు వెళ్లిన సమయంలో ఆస్పత్రులు రూల్ పాటిస్తున్నారా? వసతులు, సౌకర్యాలున్నాయా? అనుమతికి తగ్గట్టు డాక్టర్లున్నారా? పరిశీలించనున్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసి నిబంధనలు పాటించని ఆస్పత్రులతో పాటు అర్ఎంపీ, అంబులెన్స్ కమీషన్ దందా, నియంత్రణపై చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే కేసులు నమోదు చేయనున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చర్యలు



క్వాలిఫైడ్ ఎంబీబీఎస్ డాక్టర్లే ప్రజలకు వైద్య చికిత్సలు అందించాలి. అన్‌క్వాలిఫైడ్ డాక్టర్లు పరిధి దాటి వైద్యం చేయడం నేరం. బీఎఎంఎస్, బీహెచ్ఎంఎస్ చదివిన వారు అలోపతి మందులు రాయకూడదు. రిఫరల్ అమౌంట్ కోసం ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రులకు పేషెంట్లను రెఫర్ చేయడం తగదు. జిల్లాలో వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

- డాక్టర్ ఎస్.ఆనంద్, టీఎస్ఎంసీ మెంబర్, సంగారెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఇంటికి పంపాలి

- రఘునందన్‌రావును ఢిల్లీకి పంపుదాం
- వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలి
- గోవా సీఎం ప్రమోద్ సావంత్ పిలుపు
- రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక్కచోట కూడా డిపాజిట్ రాదు
- మెదక్ గడ్డపై ఎగరేది కాషాయ జెండా
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

7లో



మెదక్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న గోవా సీఎం ప్రమోద్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


బస్ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు టిఫిన్ తీసుకురావడానికి ద్విక్రవాహనంపై వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం మహదేవ్‌పురం వద్ద గురువారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు ఏషబోయిన రాములు గాజులరామారం మల్లారెడ్డినగర్, షిర్డీహిల్స్‌లో ఓఅపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు లక్ష్మణ్ (19)తో కలిసి అక్కడే నివాసముంటున్నారు. లక్ష్మణ్ లేపాక్షి కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు అల్పాహారం తీసుకురావడానికి తండ్రి స్కూటీపై వెళ్లాడు. మల్లారెడ్డినగర్ వైశాలి టింబర్‌డిపో వద్ద ఓ ప్రైవేట్‌బస్ డ్రైవర్ వేగంగా నడుపుకుంటూ వచ్చి వెనుక నుంచి లక్ష్మన్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

పంజాగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని మాజీమంత్రి, సినీనటుడు బాబుమోహన్ పేర్కొన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా పని చేస్తూ వెయ్యికి పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన మెదక్ జిల్లాకు చెందిన డాక్టర్ సింగం శ్రీనివాసరావుకు ఆర్బీఎల్ బ్యాంక్ కమ్యూనిటీ స్టార్ అవార్డును ప్రకటించింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులతో కలిసి సింగం శ్రీనివాసరావుకు ఆయన అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని కుగ్రామం రాయల్‌పల్లికి చెందిన శ్రీనివాసరావు వేలాది మందికి సహాయం చేయడం గొప్ప విషయమని కొనియాడారు.





బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాంలు

జహీరాబాద్, మెదక్ లోక్‌సభ స్థానాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్, వెంకట్రామారెడ్డిలకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం బీఫాంలు అందజేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జహీరాబాద్ మాణిక్‌రావు, సునితా లక్ష్మారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

నా ఆత్మహత్యకు కారకులను శిక్షించండి

- కలకలం రేపిన ముస్లాపూర్ యువకుడి సెల్ఫీ వీడియో
- సెల్ టవర్ ఆధారంగా గుర్తించిన పోలీసులు



వంశీ

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: 'బంధువులే నన్ను మోసం చేశారు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. నా చావుకు కారకులైన వారిని వదలొద్దు'.. అంటూ పోలీస్ అధికారులకు విన్నవిస్తూ ఓ యువకుడు సెల్ఫీ వీడియోను విడుదల చేయడం అల్లాదుర్గం మండలంలో కలకలం రేపింది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప వంశీ గురువారం సాయంత్రం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. సమీప బంధువులు తనను మోసం చేయడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగానని, ఉరి కూడా వేసుకోబోతున్నానని పేర్కొంటూ విడియోను విడుదల చేశారు. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆయన కోసం గాలించారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారించిన పోలీసులు వంశీ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ముస్లాపూర్‌లోని చెరువు కట్ట వద్ద అతడు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



మెదక్ ఎమ్మెల్యే రోహిత్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్, ఏప్రిల్ 18: నర్సాపూర్ సమీపంలోని మల్లన్నగుడి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ వాహనాన్ని గురువారం తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్తున్న క్రమంలో చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఎమ్మెల్యే సహకరించారు.

కన్నపేగు కోసం..

ఎక్కడ ఎదురుకాల్పులు జరిగినా.. ఆ తల్లికి ఎదురుచూపులే..!



- 22 సంవత్సరాలుగా తల్లడిల్లుతున్న తల్లి
- నా చావుకైనా వస్తుందో రాదో..
- మావోయిస్టు భాగ్య తల్లి ఎల్లవ్వ ఆవేదన




భాగ్య (ఫైల్)

దుబ్బాక, ఏప్రిల్ 18: 'తొలిచూలు బిడ్డ అని కూలి చేసి పెంచినం.. కాలు వంకరైతే బొంబాయిలో 15 రూపాయిల కూలి చేసుకుని బాగు చేసుకున్నాం. 22 ఏండ్ల కిందట చవితి పాశం తిని గడపదాటిన బిడ్డ మళ్లీ కంటికి కనిపించలేదు. అదేదో దేశంలో 30 మంది అన్నలు తెలంగాణోళ్లే చనిపోయింద్రనగానే గుండె గుబేలుమన్నది. చనిపోయిన వాళ్లలో నా బిడ్డ ఉందేమోనని టీవీల చూస్తుంటే పానం ఆగమైంది'.. అంటూ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం దర్మారం గ్రామానికి చెందిన మావోయిస్టు రెడ్డబోయిన భాగ్య తల్లి ఎల్లవ్వ ఆవేదన ఇది. ఛత్తీస్‌గడ్‌లో రెండ్రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలియడంతో ఆమె తన బిడ్డ జాడ కోసం తల్లడిల్లుతున్నది. 2002లో దుబ్బాక దళంలో చేరిన రెడ్డబోయిన భాగ్య అలియాస్ కల్పన, అలియాస్ మాధవి, అలియాస్ రూపి.. 22 ఏళ్ల నుంచి మావోయిస్టు పార్టీలోనే కొనసాగుతున్నారు. మావోయిస్టు దుబ్బాక దళం పూర్తిగా నిర్వీర్యమైన ప్రతికూల పరిస్థితిలో ఆమె పార్టీలో చేరారు. అప్పట్లో నిరక్షరాస్యురాలయిన ఆమె ప్రస్తుతం పోలీసుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఛత్తీస్‌గడ్ సరిహద్దు ప్రాంతంలో ప్రజలను ప్రభావితం చేసే బోధనలు చేయడంతోపాటు, నిరక్షరాస్యులకు పాఠాలు చెప్పడంలో కీలకంగా పని చేస్తున్నారని తెలుస్తున్నది. ఆమెకు 15 సంవత్సరాల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన చిన్నన్న అలియాస్ విజయ్ (ఆర్‌కేబీ కార్యదర్శి)తో వివాహం జరిగినట్టు పోలీసులు ప్రకటించారు. అంతకుమించి ఆమె గురించి సమాచారం నిఘావర్గాల వద్ద లేదు.

22 సంవత్సరాలుగా అజ్ఞాతంలో..

పీపుల్స్‌వార్, జనశక్తి, ప్రస్తుత మావోయిస్టు ఉద్యమాలకు ఉమ్మడి మెదక్ జిల్లా నాలుగు దశాబ్దాలు వేదికగా ఉంది. దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియల్ దళాలు పీపుల్స్‌వార్‌లో చురుకుగా పనిచేసేవి. జిల్లాలో 1975లో దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్ జరిగింది. జనశక్తి పార్టీ విడివడిన అనంతరం కూడవెళ్లి, మంజీరా దళాలు పనిచేశాయి. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ తరువాత నర్సాపూర్, ఇందుప్రియల్, దుబ్బాక మావోయిస్టు దళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. 1995 నుంచి 2000 సంవత్సరం వరకు విప్లవపార్టీలకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. అదే సమయంలో రెడ్డబోయిన భాగ్య మావోయిస్టు పార్టీలో చేరారు. 22 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె తన సమాచారం పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తపడుతూ మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా కూడా దర్మారంలో ఉండే తల్లి ఎల్లవ్వ, చెల్లెళ్లు మమత, కవిత, తమ్ముడు కుమార్ ఆందోళన చెందుతుంటారు. ఎప్పుడు.. ఏ చేదు కబురు వస్తుందోనని భయపడుతుంటారు.


Rangaboina Bhagya @ Kalpana @ Madhavi @ Rupi, D/o Chinthamadaka Narsaiah, W/o Suluguri Chinnana @ Vijay, Secretary, RKB DVC, Athmakur (M), Kurnool (AP). Age 38/2021 yrs, Caste Mudiraj (BC), Dharmaram (V), Mirdoddi (M&PS), Siddipet district, UG from 2004. ACM Status, RKB DVC, DKSZC Rs.4,00,000

పోలీసుల వాంటెడ్ లిస్టులో మావోయిస్టు భాగ్య వివరాలు

గడపదాటిన బిడ్డ మళ్లీ కానరాలే



తొలిచూలు బిడ్డ భాగ్య పుట్టగానే కాళ్లు వంకర ఉండేవి. బాగు చేయించడం కోసం మా ఆయన నర్సింహులు, నేను ఎన్నో దవాఖానాలు తిరిగినం. పొట్ట చేత పట్టుకుని బొంబాయి పోయి 15 రూపాయాల కూలీ చేసుకున్నం. కడుపుకు తినకుండా దాచుకుని బిడ్డ కాళ్లు బాగుచేయించినం. 22 ఏళ్ల కిందట చవితి పండుగ రోజు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆరు నెలల తరువాత పోలీసులు వచ్చి బిడ్డ వివరాలు అడిగితేనే ఆమె అన్నల్లో కలిసిందని తెలిసింది. ఐదేళ్ల కిందట ఆమె తండ్రి నర్సింహులు చనిపోయాడు. తండ్రిని ఆఖరుసారి చూడడానికి వస్తుందని ఎదురుచూసినా రాలేదు. ఏడేళ్ల క్రితం మా అత్త చనిపోయినప్పుడు కూడా వస్తుందనుకున్నా రాలేదు. ఒక్కసారి గడప దాటి పోయిన బిడ్డ కంటికి కానరాలేదు. నా ఆరోగ్యం కూడా బాగాలేదు. నా చావుకైనా వస్తుందో.. లేదో..! బిడ్డను చూడాలనిపించినా ఏ అడవిల వెతకాలే? ఎక్కడున్నదని చూడాలే? టీవీల్లో ఎప్పుడు చెడ్డ వార్త వచ్చినా గుండె ఝల్లుమంటది. బిడ్డ కంటే ముందే నేను లోకం విడచిపోవాలనీ రోజూ దేవున్ని మొక్కుతున్నా.

-ఎల్లవ్వ, భాగ్య తల్లి

విప్లవోద్యమాలకు కాలం చెల్లింది



దుబ్బాక సర్కిల్ పరిధిలో దర్మారానికి చెందిన రెడ్డబోయిన భాగ్య ఒక్కరే మావోయిస్టు పార్టీలో ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో ముగ్గురు అజ్ఞాతంలో ఉన్నప్పటికీ భాగ్య కీలకంగా పనిచేస్తున్నారు. ఆమె పేరిట రూ. 4 లక్షల రివార్డు కూడా ఉంది. ప్రస్తుత కాలంలో విప్లవోద్యమాలకు కాలం చెల్లింది. అడవిలో ఉండి సాధించేదేమీలేదు. అజ్ఞాతంలో ఉండి సాధించేదేమీ లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదు. ప్రభుత్వాలు కూడా ఉపాధి మార్గాలను పెంచాయి. భాగ్య లొంగిపోతే వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకుంటూ జనజీవనస్రవంతిలో ఉండొచ్చు. ఆమెకు ఉపాధి కల్పిస్తాం. ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తాం.

-శ్రీనివాస్, దుబ్బాక సీఐ

రసాయనశాస్త్ర విభాగంలో 26, 27న జాతీయస్థాయి వర్క్‌షాప్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 18 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాలేజీ రాసాయనశాస్త్ర విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ వాసం శ్రీనివాస్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్, వర్క్‌షాప్ చైర్మన్ ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌తో విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగముంటుందని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకిషన్, పరీక్షల నియంత్రణ అధికారి సుదర్శనం, రసాయనశాస్త్ర అధ్యాపకులు కె.ఆంజనేయులు, జి.రవికుమార్, పిసుమలత, ఎం.శ్యామ్‌సుందర్, ఎండీ సలీంపాషా తదితరలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన చరిత్ర సునీతారెడ్డిది

మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: కాంగ్రెస్‌లో ఉన్నత పదవులను అనుభవించి రాజకీయ స్వార్థం కోసం పార్టీ వీడిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డురంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. నోటీసు ఇవ్వకుండానే సస్పెండ్ చేశారని, అందుకే పార్టీ మారానని సునీతారెడ్డి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. పార్టీని వీడాలనే ఆలోచనతోనే అప్పట్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో చర్చలు జరపలేదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేస్తున్నామని, లోక్‌సభ ఎన్నికల అనంతరం మిగిలినవి కూడా అమలుచేసి చూపుతామని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. అందుకు నర్సాపూర్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయమే నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీని తెలంగాణ ప్రజలు ఆదరించరని అన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీజేపీ గల్లంతవడం ఖాయమని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కూడా కష్టపడాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ.. అదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో మరింత బలోపేతమయ్యిందని అన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, సుదర్శన్‌గౌడ్, మల్లేశంగౌడ్, శ్రీనివాస్ రావు, మహిళ విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి సుజాత, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మణీదీప్, నాయకులు హబీబ్‌ఖాన్, దుర్గారెడ్డి, రిజ్వాన్, రషీద్, సాగర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

20న సీఎం రేవంత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

20న మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు నామినేషన్ దాఖలు చేయనున్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నందున నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవులరాజిరెడ్డిలు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు



నిజాంపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

అకాలవర్షం.. ఆగమాగం

నిజాంపేట, ఏప్రిల్ 18: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి నేలపాలు కావడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. ఆరు నెలలు వ్యయప్రయాసలకోర్చి పండించిన పంట చేతికి వచ్చిన అనంతరం తడిసి ముద్దయి పనికిరాకుండా పోతున్నదని రైతులు వాపోతున్నారు. మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివానకు రోడ్లపై ఆరబోసిన, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యం నీటి పాలైంది. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్న తరుణంలో.. అష్టకష్టాలు పడి దక్కించుకున్న పంటలు నేలపాలవుతుండడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. 20 రోజుల క్రితం రాళ్ల వర్షం కురిసి వరి గింజలు నేలరాలాయి. పంట నష్టం వివరాలు సేకరించి పరిహారం అందజేయాలని కోరారు.

కేంద్రాలు తెరిచినా కొనుగోళ్లు లేవు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కోతలు పూర్తయిన సమయంలో వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయని రైతు పంజా శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి వారం గడుస్తున్నా కొనుగోళ్లు లేక వర్షాలు తడుస్తున్నదని వాపోయారు.



టార్పాలిన్ లేక కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం

- మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

టేక్మాల్, ఏప్రిల్ 18: మహిళా సాధికారతే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని పాల్వంచ గ్రామ శివారులో గురువారం నిర్వహించిన బీజేపీ మహిళా శక్తి సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల తలరాతలు మార్చడంలో బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయంతోపాటు తులం బంగారం అదనంగా ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇవ్వలేదని, మహిళలకు ప్రతీనెల రూ. 2,500 ఇస్తామని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హయాంలో ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇంటింటికి మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉజ్వల పథకంలో భాగంగా ఉచితంగా గ్యాస్ అందజేస్తున్నారని తెలియజేశారు. మహిళలు రాజకీయంగానూ ఎదగాలనే 33 శాతం రిజర్వేషన్ ఇస్తున్నదని అన్నారు. కేంద్ర మంత్రిత్వశాఖల్లోనే కీలకమైన ఆర్థిక శాఖను నిర్మలసీతారామన్‌కు కేటాయించడం ద్వారా మహిళలకు దేశాన్ని నడిపే సత్తా ఉందని నిరూపించారని కొనియాడారు. పదేళ్ల పాలనలో టెక్నాలజీని ప్రతీ ఒక్కరికి చేరువ చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రమేందర్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్, జహీరాబాద్ బీజేపీ కో కన్వీనర్ శోభారాణి, మహిళా నాయకులు సుధా, శ్రీలత, వచన పాటిల్, కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఇంటికి పంపాలి

- రఘునందన్‌రావును ఢిల్లీకి పంపుదాం
- వికసిత తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలి
- గోవా సీఎం ప్రమోద్ సావంత్ పిలుపు
- బీఆర్ఎస్‌కు ఒక్క సీటులోనూ డిపాజిట్ రాదు
- మెదక్ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 18: ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్‌ను, హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించాలని, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అత్యధిక మెజార్టీతో ఢిల్లీకి పంపాలని గోవా సీఎం ప్రమోద్ సావంత్ పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సొమ్మును దోచుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీ చేశారని, ఇప్పుడు తెలంగాణను దోపిడీ చేసేందుకు ఎంపీ టికెట్ ఇచ్చారని ఆరోపించారు. మెదక్‌కు కేటాయించిన అభివృద్ధి పనులను మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకుపోయారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, పక్కన ప్రమోద్ సావంత్, కిషన్‌రెడ్డి

వికసిత్ భారత్.. వికసిత్ తెలంగాణ కోసం రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను గెలిపించాలని కోరారు.

మెదక్‌పై కాషాయ జెండా

హామీలు అమలు చేయని కాంగ్రెస్ నేతలు ప్రచారం కోసం వస్తే తరిమికొట్టాలని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నిన్నటి పార్టీ అని.. నేడు.. రేపు దాని అవసరం లేదని ఎద్దేవా చేశారు. పైసలకు ఓట్లు రావని, దేశంలో మోదీ రాజ్యం నడుస్తోందని, ప్రధానిగా మోదీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. మెదక్ నుంచి ఒకప్పుడు టైగర్ నరేంద్రను గెలిపించారని.. ఇప్పుడు టైగర్ రఘునందన్‌రావును గెలిపించాలని, ఇందుకోసం రానున్న 25 రోజులు కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రామరాజ్యం రావాలంటే మోదీ ఉండాలి

రామరాజ్యం రావాలంటే మోదీ ప్రధానిగా ఉండాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బును నమ్ముకొని బీఆర్ఎస్.. కులాన్ని నమ్ముకొని కాంగ్రెస్ వస్తున్నాయని.. ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్న వెంకట్రామిరెడ్డి తన గురించి ఏం మాట్లాడతాడని ప్రశ్నించారు. పోలీసులు లేకుండా మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు వస్తే తేల్చుకుందామని సవాల్ విసిరారు. దుబ్బాకలో గెలువని రఘునందన్ మెదక్‌లో గెలుస్తాడని అంటున్న హరీశ్.. దమ్ముంటే మీ మామ కేసీఆర్‌ను రమ్మను అని సవాల్ చేశారు. మోదీ గ్యారెంటీ అంటే అమలయ్యే గ్యారెంటీ అని స్పష్టం చేశారు. ఈసారి దేశంలో బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం 25 రోజులు పాటు పార్టీ శ్రేణులు రామ నామం.. మోడీ జపం చేయాలని పిలుపునిచ్చారు.

అంతకుముందు లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రమైన మెదక్‌లో గురువారం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 30 వేల మందితో స్థానిక సాయిబాలజీ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆటోనగర్, పాత బస్టాండ్ మీదుగా రాందాస్ చౌరస్తా వరకు సాగింది. రఘునందన్‌రావు, పార్టీ ముఖ్యులు ఓపెన్‌టాప్ జీప్‌లో నిల్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఈ ర్యాలీలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, గోదావరి అంజిరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, కన్వీనర్ సంగమేశ్వర్, వివిధ మోర్చాల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, జిల్లా నాయకులు శ్రీపాల్, నాగరాజు, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● నర్సాపూర్ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: ఎన్నికల నిబంధనల మేరకే రాజకీయ పార్టీలు ప్రచారం చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నర్సాపూర్ ఆర్డీవో, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 2,26,762 మంది ఉన్నారని, అందులో పురుషులు 1,10,037 ఉండగా మహిళలు 1,16,719 మంది ఉన్నారని తెలిపారు. ఇతరులు ఆరుగురు ఉన్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల కంటే 4,790 మంది ఓటర్ల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 307పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరపత్రాలు, పోస్టర్లు ప్రింట్ చేయిస్తే వాటిపై ఖచ్చితంగా ప్రచురణ కర్త పేరు, ఎన్ని ప్రింటు చేశారనే సమాచారం అభ్యర్థులు వాటిపై వేయించాలని సూచించారు. ర్యాలీలు, సభలు, ఇతర కార్యక్రమాలకు రెండు రోజుల ముందు సంబంధిత అధికారుల వద్ద అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యం పంపిణీని కట్టడి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం నిరంతరం పర్యటిస్తూ నిబంధనలు ఉల్లంఘించకుండా చూస్తుందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తెలిస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఆర్డీవో సూచించారు.

నర్సాపూర్‌లోనే కౌంటింగ్

మెదక్ పార్లమెంటు ఓట్ల లెక్కింపును జూన్ 4న నర్సాపూర్‌లోనే నిర్వహించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో నర్సాపూర్, గజ్వేల్, మెదక్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల ఓట్లు లెక్కించనుండగా, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్లను గిరిజన గురుకులంలో లెక్కించనున్నట్లు తెలిపారు.



నర్సాపూర్ వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్



హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో బైక్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభిస్తున్న తహసీల్దార్

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

నర్సాపూర్: చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్‌వాన్ష్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని మల్లన్నగుడి, శభాష్‌పల్లి, మల్కాపూర్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల దగ్గర సీసీ కెమెరాలు 24గంటలు పని చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా చెక్‌పోస్టుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హత్నూర: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ సూచించారు. మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటర్లు ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దేవేందర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల రక్షణ, భద్రతపై దృష్టి సారించాలి

● అవగాహన సదస్సులో సంగారెడ్డి ఎస్పీ రూపేష్



బొంతపల్లి హెటీరో డ్రగ్స్ పరిశ్రమలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

గుమ్మడిదల, ఏప్రిల్ 18: పరిశ్రమలలో జరిగే ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని, అనుభవజ్ఞులైన టెక్నీషియన్‌లతో ప్రమాదాలను ముందుగానే పసికట్టి, నియంత్రించాలని పరిశ్రమల ప్రతినిధులకు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. గురువారం గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలోని హెటిరో డ్రగ్స్ యూనిట్ వన్ పరిశ్రమ సౌజన్యంతో బొంతపల్లి, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడలోని వివిధ కంపెనీల పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పరిశ్రమలలో వివిధ రకాల ప్రమాదాలు, భద్రతపరమైన చర్యలపై చర్చించారు. నిరుద్యోగ యువత పెరిగిపోతున్న తరుణంలో పారిశ్రామికవేత్తలు జిల్లాలో పెట్టుబడులు పెట్టి, కొత్త పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని సూచించారు. ప్రతీ కంపెనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా పరిశ్రమల నుంచి పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నా పారిశ్రామిక వాడలో రోడ్లు సరిగ్గా లేవని, ఫైర్ స్టేషన్ ఇంజన్‌లు ఇప్పటికీ అందుబాటులో లేవని పరిశ్రమల ప్రతినిధులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, ఎస్ఎస్ఎస్‌సీ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వెంకటేశ్వరరావ్, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని సంగారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ పేలుడు, ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగితే ఎలా ఎదుర్కోవాల్లో వివరించారు. అగ్ని ప్రమాదంలో గాయాలపాలైన వారిని ఆస్పత్రికి ఎలా తరలించాలో ప్రత్యక్షంగా చూపించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణబాయి, వైస్ ప్రిన్సిపాల్ హుమేరాసయీద్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ మల్లిక, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ క్రిష్ణప్రియ, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కంగ్టిలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో ప్రవీణ్‌చారి

కంగ్టి, ఏప్రిల్ 18: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి సూచించారు. గురువారం కంగ్టిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాల్ జొన్నలకు ప్రభుత్వం రూ.3,180 మద్దతు ధరను ప్రకటించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది అడివప్ప, రైతులు చందర్‌రెడ్డి, చెన్‌బసప్ప, సంగ్రాం, వెంకట్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించాలి



మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో సాఫ్ట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

మనోహరాబాద్, ఏప్రిల్ 18: జాతీయ స్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి బాలుర, బాలికల జట్టు విజయం సాధించాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు అన్నారు. మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. తెలంగాణలో ఉన్న సుమారు 16 జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన బాలురు, బాలికల క్రీడాకారులకు ఈ నెల 20 నుంచి 27 వరకు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 28 నుంచి 30వరకు కర్నాటక రాష్ట్రంలోని టు మార్క్‌లో జరిగే 3వ జాతీయ స్థాయి సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని శోభన్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి రేణుక, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి రమేష్, అసోసియేషన్ ఉపాధ్యాక్షుడు అజయ్‌కుమార్, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, సీఐ రవికుమార్, ఎస్ఐ హరీష్‌గౌడ్, కుమార్‌గౌడ్, సురేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ పత్రాలకు పూజలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 18: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ నామినేషన్ పత్రాలకు ఆయన కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ గురువారం పూజలు నిర్వహించారు. ఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో స్వామి వారి ఎదుట ఉంచి వేద పండితులతో అర్చన చేయించారు. ఈ సందర్భంగా నాయకులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు కాశీనాథ్ పటేల్ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, ముత్యం హన్మండ్లు, శివ్‌లింగ్‌పటేల్, నాయకులు సురేష్, శివ,పాండు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘనస్వాగతం పలికేందుకు తరలిరావాలి

కొల్చారం, ఏప్రిల్ 18: ఈ నెల 20న మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి వస్తున్న సీఎం రేవంత్‌కు ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ కోరారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటిసారిగా మెదక్‌కు వస్తున్న రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. మండలంలోని ప్రతీ కార్యకర్త, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ అనుబంధ నాయకులు 20న మెదక్ రాందాస్ చౌరస్తాకు చేరుకోవాలని తెలిపారు.

పెద్దమ్మగూడెంలో నీటి సమస్యను తీర్చండి

జిన్నారం, ఏప్రిల్ 18: జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. పెద్దమ్మగూడెంలో గత 15రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నల్లా నీరును సక్రమంగా అందించడం లేదన్నారు. స్థానిక అవసరాల మేరకు పంచాయతీ అధికారులు నీటి సరఫరా చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

మట్టి టిప్పర్ల సీజ్

మనోహరాబాద్: మండల కేంద్రంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న 3 టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. బుధవారం రాత్రి మనోహరాబాద్ మండల కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న 3 టిప్పర్లను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు.

బీజేపీతోనే అభివృద్ధి

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాశ్ల రాములు అన్నారు. గురువారం అల్లాదుర్గం మండలం మాందాపూర్‌లో పార్టీ మండలాధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలతో ప్రజల్లో బీజేపీపై ఆదరణ పెరుగుతుందన్నారు. మూడవ సారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాయిలుగౌడ్, నాయకులు కృష్ణ, మారుతి పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రచారం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18: పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్, మూసాపేట, బూర్గుపల్లి, కొత్తపల్లి, ఇసకపాయల తండా, కట్టెల వెంకటాపూర్, మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, గంగారెడ్డి, రాజు, బాబునాయక్, సుభాష్, భానుశ్రీహరి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

25 వరకు రాములోరి తలంబ్రాల బుకింగ్‌కు అవకాశం

నారాయణఖేడ్, ఏప్రిల్ 18: భద్రాద్రి సీతారామ చంద్రస్వామి కల్యాణ ముత్యాల తలంబ్రాలను ఇంటి వద్దకు చేర్చే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఈ నెల 25 వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఖేడ్ ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, డీఎస్పీ సీసీ ప్రేమ్‌కుమార్ ముత్యాల తలంబ్రాలను బుక్ చేసుకోగా పాండు వారికి రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రచార రథాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 18: జహీరాబాద్‌పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రచారం చేయడానికి డిజిటల్ స్క్రీన్ ప్రచార రథాలను గురువారం ఖేడ్‌లోని సురేష్‌షెట్కార్ స్వగృహం వద్ద మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్ ప్రారంభించారు. దేశాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, దేశ సమగ్రత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. హస్తం గుర్తుపై ఓట్లు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాగల్‌గిద్ద మండలాధ్యక్షుడు మాణిక్‌రావు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలి



మనూరులో ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం జయశ్రీ

మనూరు, ఏప్రిల్ 18: డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ డీపీఎం జయశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మనూరులో ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని, తిరిగి చెల్లిస్తే అధిక రుణాలను మంజూరు చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, సీసీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే సేవా సమితి

జిల్లా అధ్యక్షుడిగా బైండ్ల కృష్ణ



నారాయణఖేడ్, ఏప్రిల్ 18: అంబేడ్కర్, పూలే సేవా సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మనూరు మండలం బోరంచకు చెందిన బైండ్ల కృష్ణ నియమితులయ్యారు. గురువారం ఖేడ్‌లోని సంఘం కార్యనిర్వాహక కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరి నియామక ఉత్తర్వును అందజేశారు. ఈ సందర్భంగా బైండ్ల కృష్ణ మాట్లాడుతూ.. తనకు సంఘంలో మూడేళ్లుగా మండల స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్నదన్నారు. బాలల హక్కులు, మానవ, మహిళల హక్కుల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీలో చేరిన మాజీ ఉపసర్పంచ్



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం

వెల్దుర్తి, ఏప్రిల్ 18: వెల్దుర్తి మాజీ ఉప సర్పంచ్ కర్రె వెంకటేశంతోపాటు పలువురు గురువారం బీఆర్ఎస్ పార్టీని వీడి మెదక్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అనంతరం రఘునందన్‌రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని, మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వెల్దుర్తి మండలాధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధు తరఫున గురువారం ఎమ్మెల్యే నామినేషన్ వేసిన అనంతరం మెదక్ మండలం మాచవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో దివంగత ప్రధాని ఇందిరమ్మ ప్రాతినిథ్యం వహించిన మెదక్ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట అని చెప్పారు. నీలం మధు అత్యధిక మెజార్టీతో గెలుపొందనున్నారని, ఇందుకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణనే నిలువెత్తు తార్కాణమన్నారు. ఈ నెల 20న నీలంమధు మరో సెట్ నామినేషన్ వేస్తారని, ఆ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కలెక్టర్‌గా ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని, రంగనాయక్ సాగర్ ప్రాజక్టు ముంపు బాధితులకు పరిహారం ఇవ్వడంలో చేసిన నిర్లక్ష్యం ఆయనను ఓటమిపాలు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఓటమి ఆమె స్వయంకృతాపరాధమేనన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు బొజ్జ పవన్, పరశురాం, తాహెర్, అహ్మద్, సిద్దార్థ, శ్రీనివాస్‌చౌదరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

● బీజేపీ, కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్



వట్‌పల్లి మండలం నాగులపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు

వట్‌పల్లి, ఏప్రిల్ 18: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని బీజేపీ అందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, కిసాన్ మోర్చా నాయకులు కోరారు. గురువారం వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తాగునీటి బాటిళ్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలను ఉపాధి కూలీలకు వివరించారు. ఉపాధి కూలీలకు ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచినట్లు తెలిపారు. పని ప్రదేశంలో కూలీలకు నీడనిచ్చే టెంట్లను, తాగునీటిని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజశేఖర్, విజేందర్, అభిలాష్, యాదుల్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

జహీరాబాద్/నారాయణఖేడ్/కొల్చారం, ఏప్రిల్ 18: జహీరాబాద్ పట్టణంలో గల రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సాహభరితంగా కొనసాగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నారాయణఖేడ్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరవ రోజు గురువారం కూడా కొనసాగాయి. గజవాహన సేవ, శ్రీహరి మహరాజ్ కీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. గజవాహన సేవలో భాగంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు సాగర్ షెట్కార్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్‌లో సీతారామచంద్రస్వామికి గురువారం ఉదయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోనే ఏకైక సీతారామచంద్రస్వామి ఆలయం కిష్టాపూర్‌లో ఉంది. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజున గ్రామస్థులందరూ కలిసి చిన్నా, పెద్దా తేడా లేకుండా స్వామివారికి రథోత్సవాన్ని నిర్వహిస్తారు.



కొల్చారం మండలం కిష్టాపూర్‌లో రథోత్సవం



నారాయణఖేడ్‌లో రాముల వారి వాహన సేవ

ముస్లాపూర్ జాతర



ముస్లాపూర్‌లో ఎడ్ల బండ్ల ప్రదర్శన

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ దుర్గాభవాని జాతర గురువారం ప్రారంభమయింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంత భక్తులతో కిటకిటలాడింది, ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

రాయిలాపూర్ శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

రామాయంపేట: రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో గురువారం రామాయంపేట మండల పరిధి రాయిలాపూర్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో మాట్లాడుతూ పరమాత్ముడిని నిత్యం స్మరించుకోవాలన్నారు. దైనందిన జీవనంలో ప్రతీ మనిషి భక్తి మార్గం ఎంచుకుని ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. ఎక్కడైన ఆలయం నిర్మించడం ముఖ్యం కాదని, ధూప దీప నైవేద్యం చేసినప్పుడే లక్ష్యం నెరవేరినట్లు అని చెప్పారు.

పోలాండ్ రాయబారి సెబాస్టియన్

పోల్మోర్ స్టీల్ పరిశ్రమ సందర్శన



పోల్మోర్ పరిశ్రమ యాజమన్యంతో పోలాండ్ పోల్మోర్ రాయబార కార్యాలయ ప్రతినిధుల బృందం

మనోహరాబాద్, ఏప్రిల్ 81: మనోహరాబాద్ మండలం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక వాడలోని పోల్మోర్ స్టీల్ పరిశ్రమను పోలాండ్ రాయబారి సెబాస్టియన్ డోమ్‌జల్‌స్కి, పోలాండ్ కాన్సుల్ జనరల్ అలెగ్జాండర్ దండా గురువారం పరిశ్రమ ఎండీ సుబ్బారావుతో కలసి సందర్శించారు. పోలాండ్ పరిశ్రమ వృద్ధిపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వారికి ఉపాధి కల్పించడంపై పరిశ్రమను అభినందించారు. మేకిన్ ఇండియా విధానానికి అనుగుణంగా పరిశ్రమ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. టీఎస్ఐఐసీ ద్వారా పరిశ్రమను మరింత ముందుకు తీసుకెళ్తమని ఎండీ సుబ్బారావు తెలిపారు. యూరప్ దేశాల్లో ఉన్న పోల్మోర్ కంపెనీల్లో భారతదేశం నుంచి సుమారు 30మంది వరకు పని చేస్తున్నారని తెలిపారు. అనంతరం యూరప్ బృందం పరిశ్రమలో మొక్కలను నాటారు. పోలాండ్ తరహాలో తెలంగాణలోనూ పెట్టుబడులు పెడుతామని తెలిపారు. వారివెంట పోలాండ్ రాయబార కార్యాలయ ఆర్థిక వ్యవహారల కౌన్సిలర్ పావెల్ మొక్రజైకి, పరిశ్రమ అధికారులు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా తరలివెళ్లిన నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 18: మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గురువారం నామినేషన్ వేసిన సందర్భంగా జిన్నారం మండల నాయకులు జగన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, విజయభాస్కర్‌రెడ్డి, బాలయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మెదక్ పార్లమెంటు స్థానం నుంచి రఘునందన్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు సమష్టిగా పని చేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

● తూప్రాన్: మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరాంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



తూప్రాన్ నుంచి తరలివెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు